# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో శాంతి భద్రతల అమలు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**
2. **సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **ఇండిగో సంస్థ రద్దు చేసిన విమానాలకు సంబంధించిన బుకింగ్ ధరను చెల్లించే ప్రక్రియను ఈరోజు పూర్తిచేయాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశించింది.**
4. **భారతీయ కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**
5. **సేంద్రీయ ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**

==========================

రాష్ట్రంలో శాంతి భద్రతల అమలు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో రౌడీయిజాన్ని అణిచి వేస్తామని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఆయన నిన్న వెళ్లారు. ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో నిన్న భేటీ అయ్యారు. విజయవాడలోని లోక్ భవన్ లో ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా గవర్నర్‌తో సమావేశమయ్యారని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులపై చర్చించారని తెలిపారు.

-------------------------

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. నల్గొండ జిల్లా దేవరకొండలో నిన్న నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం

రెండు కళ్లుగా భావించి ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులతో పేదలు ఆత్మగౌరవంతో బతికేలా చేశామని తెలియజేస్తూ..

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

ఇండిగో సంస్థ రద్దు చేసిన విమానాలకు సంబంధించిన బుకింగ్ ధరను తిరిగి చెల్లించే ప్రక్రియను ఈరోజు సాయంత్రంలోగా పూర్తి చేయాలని విమానయాన సంస్థను కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ప్రయాణీకుల లగేజీని రాబోయే రెండు రోజుల్లో డెలివరీ చేయాలని ఒక ప్రకటనలో పేర్కొంది. రీఫండ్ విషయంలో ఆలస్యం జరిగినా.. నిబంధనలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రద్దయిన, అంతరాయం కలిగిన అన్ని విమానాలకు రీఫండ్ ప్రక్రియను ఈ రోజు రాత్రి 8 గంటలలోపు పూర్తి చేయాలని పేర్కొంది.

---------------------------

ఇండిగో విమానాల రద్దుతో ప్రయాణికుల సౌకర్యార్థం దేశవ్యాప్తంగా 37 ప్రీమియం రైళ్లను రైల్వే శాఖ నడిపిస్తోంది. ఆ రైళ్లకు అదనంగా 116 కోచ్‌లను జత చేస్తున్నట్లు ప్రకటించింది. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ – చెన్నై, చర్లపల్లి – కోల్‌కతా, హైదరాబాద్ – ముంబయికి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టిసి అధికారులు పేర్కొన్నారు.

---------------------------

సేంద్రీయ ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సేంద్రీయ ఉత్పత్తుల మేళాను ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రకృతి సేద్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. రైతులకు చేయూత ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని పేర్కొన్నారు.

---------------------------

భారతీయ కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. సంగీత పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా.. కేంద్ర, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖలు రెండు రోజులపాటు కృష్ణవేణి సంగీత నీరాజనం పేరుతో విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డేతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్ 30 సెకన్లు

---------------------------

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ –సర్ రెండవ దశను ప్రారంభించినప్పటి నుండి 50 కోట్ల 93 లక్షల ఎన్యుమరేషన్ ఫారమ్‌లను ఓటర్లకు పంపిణీ చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. దాదాపు 51 కోట్ల

మంది ఓటర్ల వివరాలను ఈ దశలో పరిశీలించడం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకు దాదాపు 49 కోట్ల ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు తెలిపింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ నెల 4వ తేదీ నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశ ప్రారంభమైందని వెల్లడించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న తుది ఓటరు జాబితా ప్రచురణతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ముగుస్తుందని పేర్కొంది.

----------------------------

దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సాయుధ దళాల సేవలు, త్యాగాలు స్మరించుకునే ఉద్ధేశ్యంతో ఈరోజు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1949 ఆగస్టు 28వ తేదీన రక్షణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఏటా డిసెంబరు 7వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా సౌత్ ఆఫ్రికాతో జరిగిన మూడో వన్డేలో భారత జట్టు విజయం సాధించింది. సౌత్ ఆఫ్రికా జట్టు నిర్దేశించిన 271 పరుగుల లక్ష్యాన్ని కేవలం 47.3 ఓవర్లలో 9 వికెట్లు మిగిలి ఉండగానే చేధించింది. భారత జట్టులో జైస్వాల్ 106 పరుగులు, రోహిత్ శర్మ 75 పరుగులు, విరాట్ కోహ్లీ 65 పరుగులు చేశారు. అంతకు ముందు టాస్ ఓడిన సౌత్ ఆఫ్రికా జట్టు 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ సొంతం చేసుకుంది.

----------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎం.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్.. 29 సెకన్లు

మరో వైపు.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏజన్సీ ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అరకులు 8.1 డిగ్రీలు, దుంబ్రిగుడలో 8.2 డిగ్రీలు, జి.మాడుగులలో 9.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యిందని అధికారులు తెలిపారు.

తెలంగాణాలోని రానున్న 4 రోజుల పాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రెండు రోజుల్లో తెలంగాణలో అక్కడక్కడ చలి తీవ్రత పెరిగి, కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కొమరంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా శీతల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో నిన్న నిర్వహించిన "ప్రజా దర్బార్"లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు నేరుగా స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్వర్ణ నిడదవోలు పేరుతో రూపొందించిన బులిటెన్ ను నిన్న విడుదల చేశారు.

======================